# 50

# శ్రమనొందు సేవకుడు

## (యెషయా 53)

మనమిప్పుడు పరిశుద్ధ బైబిలులో యథార్థముగా గొప్పదైన ఒక అధ్యాయమును అధ్యయనము చేయబోవుచున్నాము. మత్తయి, లూకా, యోహాను, పౌలు, మరియు పేతురు వీరందరు "శ్రమనొందు సేవకుడు" యేసే అని ఉదాహరణంగా వర్ణించుటకు 53వ అధ్యాయములో గల కొన్ని వాక్యభాగాలను ఉల్లేఖించి ఇలా వ్రాసారు:

> "అందువలన, ఆయనే మన బలహీనతలను వహించుకొని మన రోగములను భరించెనని" ప్రవక్తయైన యెషయా ద్వార చెప్పబడినది నెరవేరెను (మత్తయి 8:17; యెషయా 53:4ఎ చూడుము).

> " 'ఆయన అక్రమకారులలో ఒకడుగా ఎంచబడెను' అని వ్రాయబడిన మాట నాయందు నెరవేరవలసియున్నది; ఏలయనగా నన్ను గూర్చిన సంగతి సమాప్తమవుచున్నదని మీతో చెప్పుచున్నాననెను" (లూకా 22:37; యెషయా 53:12ఎ చూడుము).

> ప్రభువా, మా వర్తమానము నమ్మినవాడెవడు? **ప్రభువు** యొక్క బాహువు ఎవనికి బయలుపరచబడెను? అని ప్రవక్తయైన యెషయా చెప్పిన వాక్యము నెరవేరునట్లు ఇది జరిగెను (యోహాను 12:38; యెషయా 53:1 చూడుము).

అతడు లేఖనమందు చదువుచుండిన భాగమేదనగా:

> ఆయన గొఱ్ఱెవలె వధకు తేబడెను; బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెపిల్ల ఏలాగు మౌనముగా ఉండునో, ఆలాగే ఆయన నోరు తెరవకుండెను. ఆయన దీనత్వమునుబట్టి ఆయనకు న్యాయవిమర్శ దొరకకపోయెను; ఆయన సంతానము ఎవరు వివరింతురు? ఆయన జీవము భూమి మీద నుండి తీసివేయబడినది" (అపొస్తలుల కార్యములు 8:32, 33; యెషయా 53:7, 8ఎ చూడుము).

> అయినను, అందరు సువార్తకు లోబడలేదు; – "**ప్రభువా**, మేము తెలియజేసిన సమాచారమెవడు నమ్మెను? అని యెషయా చెప్పుచున్నాడు గదా?" (రోమీయులకు 10:16; యెషయా 53:1ఎ చూడుము).

> "ఇందుకు మీరు పిలువబడితిరి, క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, ... ఆయన పాపము చేయలేదు, ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు ..." (1 పేతురు 2:21–25; యెషయా 53:9బి మరియు 4–7, 11 చూడుము).

ఐతియొపీయుల న్యాయస్థాన అధికారి క్రీ.శ. మొదటి శతాబ్దములో ప్రవక్తయైన యెషయా గ్రంథంలోని ఈ గొప్ప వాక్యభాగమును మనము చేసినప్పుడు సందిగ్ధము చెందిన ఆయన వలెనే అనేకులు యిప్పటికిని యింకా కలవరపడుచునే యున్నారు. వారికి, కూడ, "లేఖనమును అనుసరించి" యేసును గూర్చిన సువార్త ప్రకటించుటకు ఎవరో ఒకరు అవసరమై యున్నారు (అపొస్తలుల కార్యములు 8:35).

## అలక్ష్యము చేయబడిన సేవకుడు1 (53:1-3)

మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను?
యెహోవా బాహువు ఎవనికి బయలుపరచబడెను?
లేత మొక్కవలెను ఎండిన భూమిలో మొలిచిన మొక్కవలెను
అతడు ఆయనయెదుట పెరిగెను.
అతనికి సురూపమైనను సొగసైనను లేదు
మనమతని చూచి, అపేక్షించునట్లుగా
అతనియందు సురూపము లేదు.
అతడు తృణీకరింపబడినవాడును ఆయెను
మనుష్యులవలన విసర్జింపబడినవాడును
వ్యసనాక్రాంతుడుగాను వ్యాధి ననుభవించినవాడుగాను
మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను.
అతడు తృణీకరింపబడినవాడు గనుక మనము అతనిని
ఎన్నికచేయకపోతిమి.

ఈ వాక్యభాగమును ఒక కీలకమైన ప్రశ్న ప్రారంభించుచున్నది: "మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను?" (వచనం 1). "సమాచారము" ప్రవక్తకు దైవికముగా బయలుపర్చబడిన బయల్పాటై యుండెను (28:9 చూడుము; యిర్మీయా 49:14). యేసు క్రీస్తు ఇహమందుండిన కాలములో దేవుని ప్రజలు సహితము ఆయన ప్రకటించిన సువర్తమానమును నమ్ముటకు తృణీకరించారు. మెస్సీయా ఫలానా విధంగా ఉండాలని వారిలో అదివరకే ఉండిన సొంత పూర్వాభిప్రాయముల వలన యేసు యెషయా చేత వర్ణింపడిన విధంగా వారు ఆయనను అంగీకరించుటకు అవి ఆటంకమైనవి (రోమీయులకు 10:16; యోహాను 12:38). "యెహోవా బాహువు" అని ఈ గ్రంథంలో మరొక చోట వ్రాయబడియున్నట్లు, దేవుడు తీర్పు తీర్చుటకును, పరిపాలించుటకును, మరియు రక్షించుటకును కలిగియున్న సామర్థ్యమును అది సూచించుచున్నది.[2]

"లేత మొక్క వలెను, ఎండిన భూమిలో మొలిచిన మొక్క వలెను" మెస్సీయ "ఆయన యెదుట పెరెగెను" (వచనం 2). ఊహించుటకైనా వీలుకాని స్థలములలో, "ఎండిన భూమిలో" పెరుగుచుండు లేత మొక్క లేక లేత రెమ్మను గూర్చిన రూపము, క్రీ.పూ. మొదటి శతాబ్దములో నెలకొని యుండిన మతము మరియు రాజకీయమునకు సంబంధించిన పరిస్థితులకు సరిగ్గా సరిపోతుంది. అందరి కంటే అధిక మూల్యమును చెల్లించిన వేలాం దారునకు యాజకత్వమును అమ్మివేయుట వలన అది అపవిత్రమైనది. రోమా సైనికదళము ఇచ్చిన ప్రోత్సాహం చేత సింహాసనముపై హేరోదు ఆసీనుడై యుండుటనుబట్టి, రాజకీయ పరిస్థితి, నిజముగానే విమర్శనాత్మకంగా ఉండినది. దేవుడు తన కుమారుని పంపిన "ఎండిన భూమి" ఇదే.

పైకి అగుపించు వేషభూషలు వంచించునవై యుండగలవు. మెస్సీయను గూర్చి యూదులకుండిన ఆకాంక్షకును, యేసు చెప్పినవాటికిని చేసినవాటికిని చాలా వ్యత్యాసముండినది మరియు అది మొత్తానికే వేరుగా ఉండినది గనుక వారు ఆయనను అంగీకరించుట నిరాకరించారు. "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను, ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు" అని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 1:11). నేడు కూడ, ఆధునిక

నాగరికత మూలాన ప్రజల్లో అదివరకే ఏర్పడియున్న మనోవైఖరులనుబట్టి అనేకులు యేసు వైపు ఆకర్షింపబడుటలేదు. అనేకులు లేఖనముల అధికారమును అంగీకరించరు, సరికదా; దేవునియందు మనసార విశ్వాసముంచరు.

ఇక్కడ చిత్రీకరింపబడిన మెస్సీయ "తృణీకరింపబడినవాడును మనుష్యుల చేత విసర్జింపబడినవాడునై యుండెను" (వచనం 3ఎ). ఈ వచనంలో రెండు పర్యాయములు కనబడు, "తృణీకరింపబడుట" (*bazah*), అను క్రియా పదము, యెషయా గ్రంథంలో యింకెక్కడను అగుపించదు. "తృణీకరించుట" అనగా "ఒకరు ఎందుకూ పనికిరానివారు, ఎటువంటి శ్రద్ధనైనను చూపించాల్సిన అవసరంలేనివారని పరిగణించుట" యని అర్థం. యేసు కాలములో జీవించినవారి విషయములో ఏది నిజమైయుండినదో అది నేడు కూడ వాస్తవమే అయియున్నది. అనేకులు ఏదో మొక్కు తీర్చుకుంటున్నట్లు "యేసు మంచివాడేనండీ" అంటూ నిజాయితీలేని మాటలు పలుకుచుందురు, కానీ ఆయన వారి పాపముల నుండి వారిని రక్షించుటకు సమర్థుడైన మనుష్యకుమారుడని ఒప్పుకొనరు, అంగీకరించరు.

ఈ సేవకుడు "వ్యసనాక్రాంతుడుగాను వ్యాధి ననుభవించినవాడుగాను" ప్రవచాత్మకంగా ఆ తరువాత వర్ణింపబడియున్నాడు (వచనం 3బి). ఈ ప్రకటనను యేసు పరిచర్యను నిదర్శనాత్మకంగా వివరిస్తుంది. ఆయన కుటుంబీకులు ఆయనను తృణీకరించారు మరియు ఆయన దేశము కూడ ఆయనను తృణీకరించినది, ఆయన మరణ సమయములో, తన స్వంత శిష్యులు సహితము ఆయనను తృణీకరించారు (యోహాను 7:5; 19:12; మార్కు 14:50).

### సేవకుని శ్రమలు (53:4–6)

> నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను
> మన వ్యసనములను వహించెను
> అయినను మొత్తబడినవానిగాను
> దేవునివలన బాధింపబడినవానిగాను
> శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితిమి.
> మన యతిక్రమక్రియలనుబట్టి అతడు గాయపరచ బడెను
> మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను
> మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను
> అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగు చున్నది.
> మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి
> మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను
> యెహోవా మన యందరి దోషమును అతనిమీద మోపెను.

"నిశ్చయముగా" (*aken*) అను పదము ఒక తారతమ్యమును గట్టిగా నొక్కిచెప్పుచున్నది (వచనం 4).[3] "మేము ఆయనలో చూసాము" అని ఆయన భరించిన "రోగములు" మరియు వహించిన "వ్యసనములు" గూర్చి ప్రజలు ఏమి అనుకున్నా, వాస్తవము అందుకు పూర్తిగా భిన్నముగా ఉండినది. ఆయన సిలువ మీద వ్రేలాడునంత వరకును భరించిన రోగములు మరియు వహించిన వ్యసనములు అవి ఆయనవి కావు కానీ అవన్నీ మనకు సంబంధించినవై యున్నవి. అందుకే పేతురు "ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు, గనుక మీ

చింత యావత్తు ఆయన మీద వేయుడి" అని క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు (1 పేతురు 5:7).

"ఎంచితిమి" అను పదము ఏదైన ఒక వస్తువు లేక ఒకరి విలువను బయలుపర్చు "లెక్కించుటకు" సంబంధించిన పదమై యున్నది. యేసు యొక్క స్వస్థత పరిచర్య గూర్చి నొక్కిచెప్పుటకు మత్తయి ఈ వచనములోని కొంత భాగమును ఉదహరించి చూపించుచున్నాడు (మత్తయి 8:17). "అయినను మొత్తబడినవానిగాను, దేవుని వలన బాధింపబడినవానిగాను, శ్రమనొందినవానిగాను మనమతని ఎంచితిమి" (వచనం 4). యేసు అపకీర్తిని తెచ్చు అవమానకరమైన మరణము నొందినది వాస్తవమునకు ఆ నాడు వారి పాపముల కొరకును ఈ నాడు మన పాపముల కొరకును అని వారు అర్థంచేసికొనలేదు (1 పేతురు 3:18; హెబ్రీయులకు 9:28 చూడము).

సేవకుని జీవితము మరియు పనిలో గల ప్రత్యామ్నాయ కోణం 5వ వచనంలో బహు చక్కగా వివరింపబడి యున్నది. ఆయన మన పాపిష్టి అవస్థతోను, మన "అతిక్రమముల"తోను మరియు "దోషముల"తోను వ్యవహరించాడు. ఆయన పరమ వైద్యుడై యున్నాడు; మనకు శ్రేయము మరియు స్వస్థత ఆయన ద్వారా కలుగును. దేవుడు మనలను ప్రేమించుచున్నాడు గనుక ఇది ముమ్మాటికి నిజం. "మీరు అలసట పడకయు మీ ప్రాణములు విసుగకయు ఉండునట్లు, పాపాత్ములు తనకు వ్యతిరేకముగా చేసిన తిరస్కారమంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనుడి" అని హెబ్రీ పత్రిక రచయిత రచించాడు (హెబ్రీయులకు 12:3). "ప్రభువు తాను ప్రేమించువానిని శిక్షించి, తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును" అని అటుతరువాత చేర్చాడు (12:6).

హెబ్రీ బైబిల్‌లో, 6వ వచనం "మనమందరమును" అని అర్థమిచ్చు అదే మాటతో మొదలౌతుంది మరియ ముగిస్తుంది. మినహాయింపులు లేవు: "మనమందరము ... త్రోవతప్పి పోతిమి, యెహోవా మన యందరి దోషమును అతని మీద మోపెను." కాపరి లేని గొఱ్ఱెలు ఎదుర్కొను ఆపద స్వంత అడుగులను నిర్దేశించుకొనలేని మన అసమర్థతను తేట పరుచుచున్నది. "మంచి కాపరి" ఇచ్చు మార్గదర్శకత్వమును అలక్ష్యముచేయువారి జీవితము పాపము వలన నాశనమగును (రోమీయులకు 1:24–32 చూడుము).

### సేవకుని వినయశీలము (53:7–9)

అతడు దౌర్జన్యము నొందెను
బాధింపబడినను అతడు నోరు తెరవలేదు
వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు
బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱెయు
మౌనముగా నుండునట్లు
అతడు నోరు తెరువలేదు.
అన్యాయపు తీర్పునొందినవాడై అతడు కొనిపోబడెను
అతడు నా జనుల యతిక్రమమునుబట్టి మొత్తబడెను గదా.
సజీవుల భూమిలోనుండి అతడు కొట్టివేయబడెను
అయినను అతని తరమువారిలో ఈ సంగతి ఆలో చించినవారెవరు?
అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడెను

ధనవంతునియొద్ద అతడు ఉంచబడెను
నిశ్చయముగా అతడు అన్యాయమేమియు చేయలేదు
అతని నోట ఏ కపటమును లేదు.

ఆ తరువాత, శ్రమనొందు సేవకడు "వధకు తేబడు గొఱ్ఱెపిల్ల" అని చెప్పబడినది (వచనం 7). "గొఱ్ఱెపిల్ల" అను పదము, సెప్టువజింట్‌లో *amnos* అను గ్రీకు పదము చేత అనువదింపబడిన పదము, మెస్సీయ గూర్చి యోహాను తన శిష్యులకు ప్రకటించుచు ఉపయోగించిన అదే పదమై యున్నది: "ఇదిగో, లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల!" (యోహాను 1:29బి). క్రొత్త నిబంధనలోను ఆది క్రైస్తవ సాహిత్యములోను. *amnos* ప్రత్యేకముగా యేసుని బల్యర్పణ గొఱ్ఱెపిల్లగా సూచించుచున్నది. ఈ పదము ప్రత్యేకించి ఎటువంటి మచ్చయైనను లేని ఒక సంవత్సరం వయస్సున్న గొఱ్ఱెపిల్లకు ఉపయోగింపబడినది.[4]

"వధకు తేబడు" మరియు "బొచ్చుకత్తిరించువాని యెదుట" అనియు నివేదింపబడిన ప్రక్రియలో, మెస్సీయ "తన నోరు తెరువలేదు." యూదులు ఎంతో అబ్బురపడునట్లు, యేసు యూదుల మహా సభ మరియు పిలాతు యెదుట నిలువబడి తానెదుర్కొన్న నానావిధ తీర్పుల సమయంలో మౌనము వహించాడు.[5]

"అన్యాయపు తీర్పునొందినవాడై అతడు కొనిపోబడెను" అని 8వ వచనంలో వ్రాయబడి యున్నది. మన ప్రభువైన యేసు క్రీస్తుకు విరోధముగా ఉసిగొల్పబడిన చర్యలు అవి మొదలుపెట్టబడినది మొదలుకొని ముగింపయ్యేంత వరకు కూడా "నిర్దాక్షిణ్యముగా అణగద్రొక్కుచుండినవై" యుండినవి. "సజీవుల భూమిలో నుండి అతడు కొట్టివేయబడెను" అను మాటలు "దౌర్జన్యము గూర్చిన దాదాపుగా అవిచ్ఛిన్నమైన లేఖాప్రమాణము" అను భావమును తెలుపుచున్నవి.[6] "మొత్తబడవలసిన, నా జనుల అతిక్రమమునుబట్టి" మన ప్రభువు దీనంతటిని సహించాడు. "అతిక్రమము"నకు "తిరుగుబాటు" అనునది ఉత్తమమైన అనువాదము.[7] ఇంత జరిగినా, "అతని తరమువారు" పాపప్రాయశ్చిత్త బలియాగము గూర్చి ఆలోచించరు, దాని ప్రాముఖ్యతను అర్థంచేసికొనరు.

"అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడెను, ధనవంతుని యొద్ద అతడు ఉంచబడెను" (వచనం 9). యేసు ఇద్దరు దొంగల (విప్లవకారుల) నడుమ సిలువవేయబడినాడు, కానీ ఆయన ధనవంతుడైన, అరిమతయియ యోసేపు సమాధిలో పాతిపెట్టబడినాడు (మత్తయి 27:38, 57–60). యేసు చూపిన వినయశీలముతో కూడిన మాదిరిని పేతురు గమనించాడు గనుక "క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడల యందు నడుచుకొనునట్లు, మీకు మాదరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు, ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు" అని చెప్పుచున్నాడు (1 పేతురు 2:21, 22).

## సేవకుని సంతృప్తి (53:10–12)

పాట యొక్క ముగింపు వచనములు, ఈ కథ ఏదో ఒక విషాదాంతమైన ప్రమాదమును గూర్చినది కాదు, కానీ సమస్త మానవాళికి రక్షణ కలుగుజేయవలెననునదే దేవుని ఉద్దేశమై

యున్నదని స్పష్టముగా తెలియజేయుచున్నవి. క్రీస్తు మరణము ఉద్దేశపూర్వకమైనది గనుక విమోచనను సమకూర్చుట కొరకు ప్రణాళిక వేయబడినది.

> అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను
> ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను.
> అతడు తన్ను తానే అపరాధపరిహారార్థబలిచేయగా
> అతని సంతానము చూచును.
> అతడు దీర్ఘాయుష్మంతుడగును, యెహోవా ఉద్దేశము
> అతనివలన సఫలమగును.
> అతడు తనకు కలిగిన వేదనను చూచి తృప్తినొందును.
> నీతిమంతుడైన నా సేవకుడు జనుల దోషములను భరించి
> తనకున్న అనుభవజ్ఞానముచేత
> అనేకులను నిర్దోషులుగా చేయును.
> కావున గొప్పవారితో నేనతనికి పాలు పంచిపెట్టెదను
> ఘనులతో కలసి అతడు కొల్లసొమ్ము విభాగించుకొనును.
> ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను
> అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను
> అనేకుల పాపమును భరించుచు
> తిరుగుబాటు చేసినవారినిగూర్చి విజ్ఞాపనముచేసెను.

"అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను, ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను" అను మాటలతో 10వ వచనం మొదలగుచున్నది. యేసు సిలువ మీద శ్రమనొందుచుండుట చూచుటనుబట్టి దేవుడు ఆనందించలేదు, ఏలయనగా భయభీతిని గొలుపు ఈ దృశ్యమును చూడకుండా ఆయన తాత్కాలికముగా తన ముఖమును మరొక వైపునకు త్రిప్పుకొన్నాడు (మత్తయి 27:46) దేవుని ఆనందము మరియు ఆహ్లాదమంతా యేసు మరణము సమస్త మానవాళికి కలుగజేసిన మేలులో ఉండినవి.

"అపరాధ పరిహారార్థబలి" (*asham*), లేక అతిక్రమ ప్రాయశ్చిత్తబలి, దేవునికి విరోధముగా ఉద్దేశరహితముగా పాపము చేసిన ఇశ్రాయేలీయుల నిమిత్తము నెలకొల్పబడినది (వచనం 10; లేవీయకాండము 5:17–19). దేవునికి అదొక పెద్ద బల్యర్పణ. సేవకుడు "తన్నుతానే అపరాధపరిహారార్థబలి చేయుట" ద్వారా ఆయన మన కొరకు "అపరాధ పరిహారార్థబలి" అయ్యాడు.

ఈ స్వచ్ఛంద బల్యర్పణవలన మూడు ఫలితాలున్నాయి: (1) "అతడు అతని సంతానమును" ఆధ్యాత్మిక ఇశ్రాయేలును చూచును; (2) "అతడు దీర్ఘాయుష్మంతుడగును," హొూమర్ హెయ్‌లీ చెప్పినట్లు ఇది స్పష్టముగా "పునరుత్థానమును సూచించుచున్న సూచనయై యున్నది, ఏలయనగా ఆయన మరణము సామాన్యముగా ప్రకటింపబడినది" (వచనాలు 8, 9);[8] మరియు (3) "యెహోవా ఉద్దేశము అతని వలన సఫలమగును."

11వ వచనములో ఒక రచయిత చెప్పినట్లు "పాపనిష్కృతి"కి సంబంధించిన అర్థము గూర్చి ఇదివరకెన్నడును వ్రాయబడనంత సంపూర్ణమైన వివరణ కలదు.[9] "నీతిమంతుడైన నా సేవకుడు, జనుల దోషములను భరించి, … అనేకులను నిర్దోషులనుగా చేయును" అని అది

చెప్పుచున్నది. ఇది దైవత్వమును గూర్చిన ఒక గొప్ప మర్మమై యున్నది! యుగయుగాలుగా దాచిపెట్టబడియుండి క్రీస్తుజీవితము, మరణము, మరియు పునరుత్థానములో బయలుపర్చబడిన మర్మము గూర్చి పౌలు మాటలాడుచున్నాడు (రోమీయులకు 16:25–27). 1 తిమోతి 3:16లో ఆయన ఒక ఆది క్రైస్తవ సంగీతమును ఉల్లేఖనముగా రచించియుండవచ్చును:

> ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను, ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పునొందెను, దేవదూతలకు కనబడెను, రక్షకుడని జనములలో ప్రకటింపబడెను, లోకమందు నమ్మబడెను, ఆరోహణుడై తేజోమయుడయ్యెను.

శ్రమనొందు సేవకుని గూర్చి యెషయా చెప్పినదానంతటికి 11బి మరియు 12వ వచనం ఒక సారాంశముగా నున్నవి. అతనికి "గొప్పవారితో పాలుపంచిపెట్టబడును" మరియు "ఘనులతో కలిసి అతడు కొల్లసొమ్ము విభాగించుకొనును" అను హేతువులను ఇవి వెల్లడించుచున్నవి. అతడు అతిక్రమకారుల నిమిత్తము తనను తాను స్వచ్ఛందగా బల్యర్పణము గావించుకొన్నాడు, లోక పాపములను భరించాడు ("మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను"; అతడు తానే అనేకుల పాపమును భరించాడు"). ఇంతేగాక, అతిక్రమకారుల కొరకు ఆయన చేసిన విజ్ఞాపనము గూర్చి కూడ ఈ వచనము చెప్పుచున్నది. ఆయన వారి కొరకు విజ్ఞాపనము చేయునట్లు ఆయన "అక్రమణకారులలో ఒకడుగా ఎంచబడును" అని యేసు చెప్పాడు (లూకా 22:37). మనము "సువార్త" అని పిలుచు "శుభ వర్తమానము" యొక్క సారము యిదే.

---

సూచనలు

[1]52:13–53:12 వాక్యభాగము కొరకైన శీర్షికలు James E. Smith, *The Major Prophets*, Old Testament Survey Series (Joplin, Mo.: College Press Publishing Co., 1992), 149-50 నుండి తీసికొనబడినది. [2]యెషయా 30:30; 40:10, 11; 51:5; 52:10; 59:16; 63:5 చూడుము. [3]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1972), 38. [4]1 పేతురు 1:19; అపొస్తలుల కార్యములు 8:32–35; నిర్గమకాండము 12:3–5 చూడుము. Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 2d ed., rev. William F. Arndt and F. Wilbur Gingrich (Chicago: University of Chicago Press, 1957), 45. [5]మత్తయి 26:63; 27:12–14. [6]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.; Inter-Varsity Press, 1993), 434. [7]అదే హెబ్రీ మూలపదము యెషయా 1:2లో "తిరుగబడియున్నారు" అని అనువదింపబడినది. [8]Homer Hailey, *A Commentary on Isaiah* (Grand Rapids, Mich.: Baker Book House, 1985; reprint, Louisvlle, Ky.: Religious Supply, 1992), 441. [9]Motyer, 442.

---

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

### ❖❖❖ విజయ మార్గం ❖❖❖
### (52:13–53:12)

సేవకుని ఈ నాలుగవ పాట దేవుని సేవకుడు విజయమువైపుగా పయనించనైయున్న

మార్గమును ప్రముఖంగా ప్రకటించుచున్నది. నిస్సందేహంగా, సాహిత్య సంపద అంతటిలోను అత్యంత ప్రభావముగల పద్యములలో ఈ పాట ఒకటై యున్నది. పాత నిబంధనలో ఇదొక గొప్ప వాక్యభాగమై యున్నది. మనము అపొస్తలుల కార్యములు 8:30–35లో చదువుచున్నట్టు ఐతియొపీయుడైన నపుంసకునికి క్రీస్తును గూర్చిన సందేశమును ఫిలిప్పు యెషయా 53:7, 8 వచనముల నుండి చెప్పుటకు మొదలుపెట్టాడు.

ఈ పాటలో, రక్షకుడు పాపము మరియు మరణముపై సాధించు విజయమువైపు చేయుచున్న ప్రయాణమును మనము చూస్తాము. విమోచనము కలుగజేయు ఆయన జీవితము పయనించాల్సి ఉండిన అడుగుల జాడలు గమనించండి.

*శ్రమల ద్వారా విజయము.* ఈ పాటలో పేర్కొనబడినవాడు శ్రమనొందు సేవకుని వలె విజయము సాధించాడు, కానీ యుద్ధశూరుడుగా లేక ఒక సైనిక దళాధిపతి వలె కాదు. అవమానకరమైన శ్రమ మరియు అమానుషమైన తన ఉపచారము నుండి, ఆయన మహిమ మరియు ప్రాముఖ్యతగలవాడయ్యాడు. ప్రజల హృదయాలను ఆయన తన వేషభాషలతో ప్రభావితం చేయలేదు. ఆయన, ఒక రెమ్మ వలె, ఎండిన రాజకీయ, మతసంబంధమైన, మరియు నైతిక ఎడారిలో మొలకెత్తాడు (వచనం 2ఎ). ఆయన చుట్టూర ఉండినవారు ఆయన ఆధ్యాత్మిక అందమునుగమనించుటకు విఫలులై ఆయనకు విలువేమీ ఇవ్వలేదు (వచనం 2బి). ఆయన తృణీకరింపబడినాడు, లేక వారు ఆయనకు అతి తక్కువ విలువ ఆరోపించారు (వచనం 3), అట్లయినప్పటికిని మన రోగములను భరించుటకును మన వ్యసనములను సహించుటకును ఆయనొక్కడే యోగ్యుడయ్యాడు (వచనం 4). ఆయన “మన అతిక్రమక్రియలనుబట్టి గాయపరచబడెను” మరియు “మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను” (వచనం 5ఎ). “మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను ...” (వచనం 5బి). ఆయన ఘోరాతిఘోరమైన శ్రమను అనుభవించాడు, కానీ అదే శ్రమ నమ్మశక్యముకాని విజయమునకు మార్గమును సరాళము చేసినది.

*సేవ ద్వారా విజయము.* ఇతరుల ప్రయోజనార్థమై తన సేవకుడు శ్రమనొందునట్లు దేవుడు అనుమతించాడు. ఆయన అనుభవించిన బాధ అది ఆయన తన సొంత పాపములు మరియు దుష్కార్యముల ఫలితంగా తనకైతానే కలుగజేసుకొన్న బాధ కాదు. కానీ, ఆయన ఇతరుల పాపములను భరించుచుండెను. “మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి, మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను; యెహోవా మనయందరి దోషమును అతని మీద మోపెను” అని యెషయా రచించాడు (వచనం 6); “అతడు తనకు కలిగిన వేదనను చూచి, తృప్తినొందును; నీతిమంతుడైన నా సేవకుడు, జనుల దోషములను భరించి తనకున్న అనుభవ జ్ఞానముచేత, అనేకులను నిర్దోషులనుగా చేయును” (వచనం 11).

సేవకుడు శ్రమనొందుట, మరణించుట, మరియు పాతిపెట్టబడుట ఈ చరణములో ముందుఛాయగా నిలిచాయి. నియంతయైన ఒక రాజు తన రాజ్యములో బందీగా ఉన్నవానిని బాధించునట్లుగా ఆయన వేధింపబడి చెడు ఉపచారమునకు గురయ్యాడు. ఆయన పీడింపబడినప్పుడు, శరీరకంగాను మానసికంగాను బాధనొందుచు, తనను తాను సమర్థించుకొని సంరక్షించుకొనుటకు ఆయన నోరు విప్పలేదు. ఆయన కాలమందుండినవారు ఆయనను మరణమునకు పాత్రుడగు దేవదూషకునిగా పరిగణించారు, కానీ ఆయన పొందిన శ్రమ యొక్క అంతిమ ఫలితం అనేకులకు జీవం పోసింది. ఇతరులు వారి పాపముల నుండి

విముక్తి నొందునట్లు ఆయన తనదైన జీవన శైలిలో జీవించాడు, ఈ శ్రమను సహించాడు, మరియు భయంకరమైన రీతిగా మరణించాడు. ఆయన తనను తాను ఇతరుల కొరకే అర్పించుకొన్నాడు.

*వినయ శీలము ద్వారా విజయము.* లొంగిపోవుట కష్టమైనదిగాను బాధకరమైనదిగాను ఉండినప్పటకిని, ఆయన తన మనస్సును మరియు తన జీవితమును దేవుని చిత్తమునకు వశంచేసాడు. "అతడు దౌర్జన్యము నొందెను, బాధింపబడినను అతడు నోరు తెరవలేదు; వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు, బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెయు, మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు" (వచనం 7). మౌనంగాను వినయముతోను, ఆయన యెడల ఉండిన దేవుని ఉద్దేశములకు తనను తాను అప్పగించుకొన్నాడు.

ఇహమందు ఆయన నడచివెళ్లిన బాటలో ఏర్పడిన ఆయన అడుగుల జాడ శ్రమలు, సేవ, మరియు లోబడుట యను బిందువులతో స్పష్టంగా గుర్తింపబడి యున్నది. ఆయన విజయ నగరమునకు విజేతగా నడిచివెళ్లినది ఈ మార్గములోనే.

శ్రమనొందు సేవకుడు సాధించిన విజయము అసమానమైనది. గనుక ఆయన గూర్చి దేవుడు ఇలా సెలవిచ్చుచున్నాడు, "కావున, గొప్పవారితో నేనతనికి పాలుపంచిపెట్టెదను, ఘనులతో కలిసి అతడు కొల్లసొమ్ము విభాగించుకొనును; ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను, అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను; అనేకుల పాపమును భరించుచు, తిరుగుబాటుచేసినవారిని గూర్చి విజ్ఞాపనము చేసెను" (వచనాలు 11బి, 12). మన కొరకు మన పాపములను భరించుటకు ఆయన తనను తాను తగ్గించుకొన్నాడు గనుక, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించాడు (ఫిలిప్పీయులు 2:8, 9).

---

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

---

### ❖❖❖ సేవకుడు, క్రీస్తు ❖❖❖
**(53)**

53వ అధ్యాయం యెషయా గ్రంథంలో అందరికీ సుపరిచితమై ప్రఖ్యాతిగాంచిన అధ్యాయమై యుండవచ్చును. ఇది సేవకుని గూర్చిన చివరి పాటలో భాగమై యున్నది.

### "ఎండిన భూమిలో నుండి"

మన ప్రభువు "లేత మొక్కవలెను ఎండిన భూమిలో మొలిచిన మొక్కవలెను" వర్ధిల్లాడు (53:2). ఆయన అసంభావ్యమైన స్థలము నుండి వచ్చాడు: గలిలయలోని నజరేతు. అతడు మెస్సీయను, నజరేతువాడైన యేసును, కనుగొన్నాడని ఫిలిప్పు నతనయేలుతో చెప్పినప్పుడు, నతనయేలు "నజరేతులో నుండి మంచిదేదైన రాగలదా?" అని ప్రశార్థక ప్రత్యుత్తరమిచ్చాడు (యోహాను 1:46). దేవుని కుమారుడు జన్మించుటకు నజరేతు ఒక అసంభవమైన చోటై యుండినది.

లేవీయకాండము ప్రకారము, యూదయ తల్లిదండ్రులకు బిడ్డ పుట్టినప్పుడు, బిడ్డ తండ్రి ఒక పావురపు పిల్లనైనను తెల్లగువ్వనైనను మరియ ఒక గొఱ్ఱెపిల్లను దేవునికి బలిగా అర్పించవలెను. తండ్రి వీటిని అర్పించలేనంత బీదవాడైనట్లుయితే, రెండు పావురపు పిల్లలనైనను, తెల్లగువ్వలనైనను అర్పింపవలెను. యోసేపు మరియు మరియమ్మ యేసును యెరూషలేములోని దేవాలయమునకు తీసికొని వెళ్లినప్పుడు, వారు పేదవారైనందువలన రెండు పావురపు పిల్లలను/తెల్లగువ్వలను అర్పించారు (లుకా 2:22-24). యేసు తల్లిదండ్రులు ధనవంతులు కారు.

యేసు చూడటానికి అంత అందగాడు కాడు. "మనమతని చూచి, అపేక్షించునట్లుగా, అతనియందు సురూపము లేదు" (53:2). ఆయన ఆ నాటి కాలములో అందరూ ఉండినంత సగటు ఎత్తైనవాడై యుండును, ఐదున్నర అడుగుల ఎత్తు. చామన ఛాయ కలిగి, భుజాల మీదుగా జారుచుండిన గోధమ రంగు వెంట్రుకలు, నిండు గడ్డము గలవాడై యుండును. అనగా, ఆయన ఆ నాటి మామూలు మనిషై యుండెనని మరొక మాటలో చెప్పుకొనవచ్చును. యెషయా చెప్పుచున్నట్లు, ఆయనకు సురూపమైనను సొగసైనను లేదు మరియు ఆయన జన్మస్థలము, సామాన్యమైన గ్రామము.

### "వ్యసనాక్రాంతుడు"

ఇంక, యేసు "తృణీకరింపబడినవాడును మనుష్యుల వలన విసర్జింపబడినవాడునై" యండెను (53:3). ఆయన గూర్చి సాధారణంగా ఉన్నతమైన అభిప్రాయము లేదు.

అతనిని ఇష్టపడనివారితో కూడ ఉండుటకు ఎవరికీ ఇష్టమనిపించదు. సరికదా ఇతరులకు దూరంగా ఒక్కరే గాని ఒంటరిగా గాని ఉండుట కూడ అంత ఆహ్లాదకరమనిపించదు. కొన్ని పర్యాయములు ఒక పెద్ద గుంపులో ఉంటూ కూడ మనము ఒంటరివారమై యుండవచ్చును. ఒంటరిగా ఉండుట ఎలా ఉంటుందో మన ప్రభువుకు తెలియును. ముమ్మారు, యేసు ఏడ్చుచు కన్నీరుకార్చినట్లు బైబిలు చెప్పుచున్నది: ఒకసారి లాజరు మరణించినప్పుడు, ఒకసారి విజయోత్సవముతో ప్రవేశింపక మునుపు యెరూషలేములో ఉన్నప్పుడు, ఒకసారి గెత్సేమనే తోటలో. వ్యసనపడుట అనగా ఏమిటో ఆయన బాగుగా ఎరిగినవాడై యుండెను. అందుచేతనే ఆయన మనకు తన సానుభూతిని చూపించగలడు. మనము ఆయనకు మొరపెట్టినప్పుడు ఇది అర్థవంతమైనదౌతుంది. మనము ఆయనతో మాటలాడుచున్నదేమిటో మన ప్రభువు సరిగ్గా అర్థంచేసికొనగలడు ఏలయనగా మనమెదుర్కొనుచున్న పరిస్థితులను ఆయన కూడ ఎదుర్కొన్నాడు. ఆయన ముఖముపై ఎవరైనా ఉమ్మివేసినట్లయితే అది ఎలా ఉంటుందో ఆయనకు తెలియును.

### మన కొరకు ఆయన చేసిన బలియాగము

క్రీస్తు మన కొరకు ఏంచేసాడో 4వ వచనం చెప్పుచున్నది: ఆయన మన రోగములను భరించాడు మరియు మన వ్యసనములను వహించాడు. ఒక బోధకుడు, యెషయా 53:4-6లో గల విషయాన్ని వివరస్తూ, "మనము ఈ వచనములను చదువునప్పుడు 'అతడు,' 'మన,' 'మనలో,' 'మనకొరకు,' 'మనము' మొదలగు మాటలను నొక్కి వక్కాణించవలెను" అని చెప్పాడు. విషయమంతా ఏమిటంటే ఆయన దీనంతటిని మన కొరకే చేసాడు. దీనంతటిలో ఏ

విషయమునైనను ఆయన తన నిమిత్తము చేయనవసరము లేనేలేదు. నేను ఆయన స్థానంలో ఉండినట్లయితే, "ఇంతవరకు చాలును, ఇక భరించలేను!" అని చెప్పుటకు శోధింపబడి అంతటితో ఆ బాధ మరియు అవమానము నుండి తప్పుకొనెడివాడను. ఏదిఏమైనా, క్రీస్తు ఆ పని చేయలేదు. ఆయన ఈ అగ్నిపరీక్ష నంతటిని ఆనందంగా ఎదుర్కొన్నాడు: కొరడా దెబ్బలు కొట్టబడినాడు, సిలువను మోసికెళ్లాడు. చేతులలోనికి మేకులు దిగగొట్టబడినప్పుడు సహించాడు. యేసు సిలువ మీద నుండి దిగిరావలెనని ఆయనను చూచుచుండినవారు ఎత్తిపొడవు మాటలు పలికినప్పుడు, ఆయన ఆ హేళనను సహితము సహించాడు. అదే పరిస్థితిలో నేనుండినట్లయితే, నేను సంతోషంగా క్రిందికి దిగివచ్చెడివాడనే. వాస్తవమునకు సిలువ మీద నుండి దిగిరావలెనని ఆయన ఆశించియుండినట్లయితే ఆయన ఆ పని చేయగలిగి యుండెను, కానీ అలా చేయలేదు. ఆయన తన తుది శ్వాస విడుచునంత వరకు సిలువ మీదనే వ్రేలాడాడు, ఆయన అలా వ్రేలాడియుండినది మనకొరకే. దేవుని సేవకుని గూర్చి 4వ వచనంలో యెషయా నేర్పించుచుండినది అదే: మన కొరకే ఆయన "మొత్తబడినాడు," "దేవుని వలన బాధింపబడినాడు, మరియు "శ్రమనొందినాడు."

## క్రీస్తు అన్యాయపు మరణము నొందుట

అతిక్రమములను బట్టి "మొత్తబడవలసిన వారికి బదులుగా" క్రీస్తు "బాధింపబడినాడు మరియు తీర్పు తీర్చబడినాడు." 8వ వచనం యేసు యొక్క అన్యాయపు మరణమును సూచించుచున్నది మరణము నొందునట్లు ఆయన జనులు "మొత్తబడవలసి యుండనది," ఆయన కాదు. ఆయన యెడల వ్యవహరింపబడిన విధానమునకు అర్హుడగుటకు ఆయన ఏ అతిక్రమమునైనను చేయలేదు, కానీ మన నిమిత్తం ఆయన దానిని ఆనందంతో అంగీకరించాడు. ఒక నిదర్శనాత్మక పటము ఇలా చెప్పుచున్నది: " 'ప్రభువా, నీవు నన్నెంతగా ప్రేమించుచున్నావు?' అని నేను ప్రభువు నడిగాను. అందుకాయన తన బాహువులను సువిశాలంగా చాపి మరణించాడు."

## క్రీస్తు సమాధి

క్రీస్తు సమాధి 9వ వచనంలో పేర్కొనబడింది. యేసు పాతిపెట్టబడిన సమాధి ధనవంతుడైన, అరిమతయియ యోసేపుకు చెందినది. ఆ రోజుల్లో సామాన్య ప్రజలలోని అధిక సంఖ్యాకులు మామూలుగా శోకసూచకముగా నుండిన ముతక గుడ్డలో చుట్టబడి నేలలో త్రవ్వబడిన గుంటలో పాతిపెట్టబడిరి. ఏదిఏమైన, ధనవంతుల సమాధులు వెవ్వేరు గదులగ విభాగింపబడి యుండినవి. సమాధి ద్వారమునకు కొంచెము లోపల ఒక చలవరాతి పలక లేక రాయి ఉండినది. దేహము (శవము) శిథిలమై కుళ్లిపోవునట్లు ఈ పలక మీద ఉంచబడినది. అది కుళ్లిపోయిన తరువాత, ఎముకలు 'అస్థిపాత్ర' అని పిలువబడెను ఒక పెట్టెలో పెట్టబడి మరొక గదిలో ఉంచబడినవి.

## బలియైన క్రీస్తు

10వ వచనంలో, క్రీస్తు "అపరాధపరిహారార్థబలి"గా సూచింపబడియున్నాడు. వెవ్వేరు విధములైన అర్పణలు అర్పింపబడినవి. దహన బలి సంపూర్తిగా బలిపీఠముపై

దహించివేయబడినది. సమాధానార్థ బల్యర్పణను అందరు కలిసి ఆరగించారు, అపరాధపరిహారార్థ బలి (లేక పాపపరిహారార్థ బలి) కాల్చబడునట్లు దానిని పట్టణము గవిని వెలుపలికి తీసికొనివెళ్లారు. యేసు మన పాపముల యొక్క బల్యర్పణయై యుండెను. ఆయన సిలువ మీద నుండి, "నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివి?" అని పలికాడు (మత్తయి 27:46; మార్క 15:34). స్పష్టముగా, ఆ సమయంలో సమస్త మానవాళి పాపములు యేసుపై మోపబడినవి. "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు, పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను" అని పౌలు చెప్పుచున్నాడు (2 కొరింథీయులకు 5:21). దేవుడు క్రీస్తును "మన పాపముల కొరకైన అర్పణయై యుండునట్లు" చేసెనని కొన్ని అనువాదములు చెప్పుచున్నవి (NLT చూడుము). ఇదొక అతి ప్రాముఖ్యమైన భావన.

**క్రీస్తు పునరత్థానము**

క్రీస్తు "నలుగగొట్టబడినాడు" మరియు "వ్యాధికలుగజేయబడినాడు" అని యెషయా చెప్పుచున్నప్పటికిని, క్రీస్తు మృతులలో నుండి లేచునని కూడా ఆయన ప్రవచించుచున్నట్లున్నది. "అతడు అతని సంతానము చూచును, అతడు దీర్ఘాయుష్మంతుడగును, యెహోవా ఉద్దేశము అతనివలన సఫలమగును" అని యెషయా రచించాడు (వచనం 10).

**క్రీస్తు సిలువవేయబడుట – ఆయన ఇప్పుడున్న స్థలము (ఒక పోలిక)**

క్రీస్తు ఇద్దరు దొంగల నడుమ సిలువవేయబడినాడు, కానీ ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో అని ఒక్కసారి ఆలోచించుము. "గొప్పవారితో నేనతనికి పాలుపంచిపెట్టెదను ..." అని దేవుడు యెషయా ద్వారా సెలవిచ్చుచున్నాడు (వచనం 11బి). ఇది చేయబడవలసిన కార్యమై యుండినది "ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను, అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను; అనేకుల పాపమును భరించుచు, తిరుగుబాటు చేసినవారిని గూర్చి విజ్ఞాపనము చేసెను" (వచనం 12). మన పాపముల కొరకు అర్పింపబడిన బల్యర్పణ ఇప్పుడు "దేవుని కుడిపార్శ్వమున" కూర్చుండియున్నాడు (మార్కు 16:19; రోమీయులకు 8:34; హెబ్రీయులకు10:12).

## ❖❖❖ ఫిలిప్పు యెషయాను ఉపయోగించుకొనుచున్నాడు ❖❖❖ (53:7, 8)

అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయంలో, ఫిలిప్పు యెరూషలేము నుండి గాజాకు వెళ్లవలసినదని అతనికి ఆదేశమియ్యబడినది. మార్గములో, ఆరాధించుటకు యెరూషలేము పట్టణమునకు తన రథముపై వచ్చి తిరిగి వెళ్లుచుండిన ఐతియోపీయుడైన నపుంసకుని ఆయన కలిసికొన్నాడు. ఆయన ప్రయాణము చేయుచు, ప్రవక్తయైన యెషయా రచించిన వాక్యములను చదువుచుండెను. ఆయన చదువుచుండిన విషయమును గ్రహించుచున్నాడో లేదో అని ఫిలిప్పు అతని ప్రశ్నించాడు. అతినికి ఎవరైనా సవివరంగా వివరించవలెనని నపుంసకుడు ఫిలిప్పును ఆహ్వానించాడు.

నపుంసకుడు యెషయా 53:7, 8లో గల వాక్యభాగమును చదువుచుండెను (అపొస్తలుల కార్యములు 8:32, 33 చూడము). ఒకరు పాత నిబంధనను చదువుట నేను గమనించి

అతనికి క్రీస్తు గూర్చి తెలియజెప్పినట్లయితే, అతడు ఈ వచనములు గాక ఇతరమైన మరి ఏ వచనములనైనను చదువునని నేను ఆలోచించలేదు.

అపొస్తలుల కార్యములు 8:34లో నపుంసకుడు ఒక ఆసక్తికరమైన ప్రశ్నను లేవదీసాడు. ప్రవక్త తనను గూర్చి చెప్పుచున్నాడా లేక మరొకరి గూర్చియా అని ఫిలిప్పును ప్రశ్నించాడు. ఫిలిప్పు క్రీస్తును గూర్చి బోధించునట్లు అది అతనికొక చక్కని ఆహ్వానమయ్యింది.

యెషయా 53వ అధ్యాయంలోని అంశము గూర్చి యూదులలో వెర్వేరు అభిప్రాయములున్నవి. శ్రమలనుభవించుచుండిన ఇశ్రాయేలీయుల గూర్చి యెషయా మాట లాడుచున్నాడనునది అత్యంత ప్రజాదరణ పొందిన అభిప్రాయములలో ఒకటి. నిజముగానే ఇదొక ద్వంద్వ ప్రవచనమై యుండును ఏలయనగా యెషయా గ్రంథంలో పేర్కొనబడిన సేవకుడు కొన్నిపర్యాయాలు ఇశ్రాయేలై యున్నది, కొన్నిపర్యాయాలు మెస్సీయయై యున్నాడు. తానే అనుభవించుచుండిన హింసల గూర్చి యెషయా మాటలాడుచుండవచ్చునని ఇతరులు చెప్పుచున్నారు. తన ప్రవచనముల మూలాన యెషయా నిజముగానే కొందరితో శత్రుత్వమును కొనితెచ్చుకొన్నాడు. ఇలాంటి ఇతర అర్థవివరణలు అనేకమున్నాయి. యెషయా ఇశ్రాయేలును సూచించుచుండినప్పటికిని, ఈ ప్రవచనముల అతి గొప్ప నెరవేర్పు క్రీస్తే. క్రొత్త నిబంధనలోని వాక్యభాగము ఫిలిప్పు చేత ఈ విధముగా వివరింపబడినది.